క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

తంబళ్లపల్లె: మండలంలో పదో తరగతి విద్యార్థుల పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 161 మంది విద్యార్థులకు గాను 159 మంది విద్యార్థులు పరీక్షలు రాశాయి. పలు కారణాలతో ఇద్దరు పరీక్షలకు గైర్హాజరయ్యారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 143 మందికి గానూ అందరూ హాజరయ్యారు. మోడల్ స్కూల్‌లో ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 18వ తేదీ పరీక్ష జరుగుతుందని ఎంఈఓ త్యాగరాజు తెలిపారు. ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 16 మంది ఎంపిక

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 16 మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్ రెడ్డి అన్నారు. శనివారం బెంగళూరుకు చెందిన సిరిగ్రూప్ హెచ్‌ఆర్ గురురాఘవేంద్ర, వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 169 మంది అభ్యర్థులు హాజరుకాగా 16 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ ఖాసీం, సురేష్ పాల్గొన్నారు.

కామర్స్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన కామర్స్ అధ్యాపకుడిగా పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుధాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్ పీజీ కోర్సులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. సెట్, నెట్, ఎం.ఫిల్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

18న బుగ్గకాల్వలో గంగజాతర

మదనపల్లె సిటీ: స్థానిక బుగ్గకాల్వలో వెలసిన గంగమ్మ జాతర 18న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి తిరునాల, 19న పగలు తిరునాల జరుగుతుందని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

17,18న తిరుపతిలో జాతీయ సదస్సు

మదనపల్లె : మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్), మహాజనస్టూడెంట్స్ యూనియన్ (ఎంఎస్‌యూ) సంయుక్త ఆధ్వర్యంలో 17,18న తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, శ్రీనివాస ఆడిటోరియంలో జరుగనున్న ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ ఉమ్మడిజిల్లా కోఆర్డినేటర్ నరేంద్రబాబు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఈ సదస్సులో ఎస్సీ వర్గీకరణతో పాటు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర అగ్రకుల పేదవర్గాల సమస్యలు, వాటి పరిష్కారమార్గాలు చేయాల్సిన ఉద్యమపోరాటాలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

శిశు సంరక్షణ తల్లి బాధ్యత

వాల్మీకిపురం: శిశు సంరక్షణ తల్లి బాధ్యత అని, బాల్యం ఆరోగ్యంగా గడపాలంటే బిడ్డ అనారోగ్య లక్షణాలను గుర్తించే నైపుణ్యం ప్రతి తల్లికి ఎంతో అవసరమని డీఐవో డాక్టర్ ఉషశ్రీ అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ పరిధిలోని జమ్మిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరం, జలుబు, నీరసం, శ్వాస తీసుకోవడం కష్టం, వాంతి చేసుకోవడం, అసాధారణ విరేచనాలు, తల్లిపాలు, అదనపు ఆహారం తీసుకోవాలనే ధ్యాస లేకపోవడం తదితర లక్షణాలు గుర్తించి, దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, సీహెచ్‌వోలు ఇందిరారాణి, నారాయణ, సూపర్‌వైజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

మదనపల్లె : విశాఖఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ 17న కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారన్నారు.

అదేరోజు సాయంత్రం యూనియన్ నాయకులు కలిసినప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పురోగతిలో ఉందని, కేంద్రక్యాబినెట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారన్నారు. మరుసటిరోజు కేంద్రప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ డిజిన్‌వెస్ట్‌మెంట్‌కు కట్టుబడిఉన్నదని ఢిల్లీలో ఉక్కు,గనులశాఖ తెలిపిందన్నారు. ఈ ద్వంద్వైఖరులకు నిరసనగా ఏఐటీయూసీ రాష్ట్రసమితి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మను దహనం చేయాలని కోరారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

– మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి




జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాన్ని ప్రజలకు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కలకిరి: మేడికుర్తి గ్రామంలో ఇంటింటా ప్రచారం

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల అభ్యున్నతి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 26వవార్డు సొసైటీకాలనీలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మనూజారెడ్డి ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు తేడాలను ప్రజలకు వివరించారు. రెండు పేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల న్నింటినీ 98 శాతానికి పైగా నెరవేర్చారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శక పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ నిండు మనస్సుతో మళ్లీ ఆయనే సీఎంగా కావాలని కోరుకుంటున్నారన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

పీలేరు రూరల్ : అన్ని వర్గాల అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ టూరిజం జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎస్. షాకీర్ అన్నారు. శనివారం స్థానిక జెండామాను, పెద్దమసీదు వీధి తదితర ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడా ప్రజలు గమనించాలన్నారు. మళ్లీ రాష్ట్రానికి జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మసూద్, మునీర్, ఉబేదుల్లా, అబీద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

వాల్మీకిపురం: నిరుపేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారని ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెట్టిపాల్యెంవీధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని సంక్షేమ పథకాలకు తేడాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాజేష్, సచివాలయ కన్వీనర్ రాయుడు, నాయకులు ముబారక్, అషర్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలోనే రికార్డు

కురబలకోట: దేశ చరిత్రలోనే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రికార్డు స్థాయిలో సాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. శనివారం వారు కురబలకోటలో మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి గడప తొక్కుతున్నారన్నారు. ప్రతి ఒక్కరినీ పలకరిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తున్నారన్నారు. సమస్యలుంటే పరిష్కారానికి చొరవ చూపుతున్నారన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా నిత్యం వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజలతో మమేకం అవుతున్నారన్నారు. ఎంపీటీసీ కొండతూర్పు ముదివేటి ఆనందరెడ్డి, సదానంద రెడ్డి, కురబలకోట రాజశేఖర్, మీసేవ రవీంద్రారెడ్డి, శెట్టి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జగననన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

కలికిరి: జగననన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మండలంలో విశేష స్పందన లభిస్తోంది. మండల పరిధిలోని గ్రామ గ్రామాన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ది సంతృప్తి తీరుపై ప్రజాభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. గత ప్రభుత్వంలో అమలైన పథకాలు.. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తేడాను వివరించి, మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

కేవీపల్లె : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోమన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కేవీపల్లె పంచాయతీ దిగువ వగళ్లలో జననన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, గజ్జెల శీన్ రెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి సతీష్‌రెడ్డి, నాయకులు సి.కె.యర్రమరెడ్డి, జయ రామచంద్రయ్య, సైపుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం గోపిదిన్నె పంచాయతీలో సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి,గొర్ల మల్‌రెడ్డి వలంటీర్లు , గృహసారథులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పేదల సంక్షేమమే వైఎస్సార్ ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి గ్రామం మదనపల్లి రోడ్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడు, నాలుగు రోజులు పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ కోసం కాసుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒకటో తేదీన పింఛన్ ఇంటికి తెచ్చి ఇస్తున్నారని వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనే మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు పని చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఈవో పాండు, నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనాథ రెడ్డి, వెంకట్రమణ, కిరణ్ కుమార్, మోహన్ రెడ్డి, ఫారుఖ్, చెంగల్‌రెడ్డి, మెంబర్ శీనా, శ్రీనివాసులు, నల్లంకి నరసిహులు, ప్రియరంజన్ రెడ్డి, సుధాకర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడి రాజీనామా



రాజీనామా పత్రాన్ని సీఈఓ వెంకటరమణకు అందజేస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట-శివారెడ్డి

గుర్రంకొండ: గుర్రంకొండ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటశివారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన వెంకటశివారెడ్డి 2019 జులై 7 తేదీన సింగిల్‌విండో అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 98 డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం గుర్రంకొండ పంచాయతీ దౌలత్‌ఖాన్‌పల్లెలో ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. ఈనేపథ్యంలో శనివారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయానికి చేరుకొని సింగిల్‌విండో డైరెక్టర్లు తరిగొండ ప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్‌లతో కలసి సీఈవో వెంకటరమణకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కారించాలి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆర్డీఓను కోరుతున్న బాస్ నాయకులు

మదనపల్లె : ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీఓ అధ్యక్షతన డివిజన్‌స్థాయి ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో ప్రతి నెలా తహసీల్దార్లు తప్పనిసరిగా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశాలు, సివిల్‌రైట్స్‌డే నిర్వహించి, కార్యక్రమ వివరాలను మినిట్స్‌బుక్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశానికి ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర్, డీఎల్‌డీఓ లక్ష్మీపతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ..వేసవికాలంలో దళితవాడల్లో తాగునీటిసమస్య లేకుండా చూడాలన్నారు. అధికారులు ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ.. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో రూ.2,000 కోట్ల విలువైన డి.సి.రిజర్వ్‌డ్ భూములు దురాక్రమణకు గురయ్యాయన్నారు. వీటిపై ప్రత్యేక సర్వే చేయించి వాటిని ఎస్సీ, ఎస్టీలకు అప్పగించాలని కోరారు. మండలస్థాయిలో ఎస్సీ,ఎస్టీ యాక్ట్ నిఘా, పర్యవేక్షణ కమిటీ, సివిల్‌రైట్స్‌డే మొక్కుబడిగా జరుగుతున్నాయన్నారు. బాస్ మాజీ అధికార ప్రతినిధి శ్రీచందు మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీయాక్ట్ కింద ఫిర్యాదు చేసిన కేసుల్లో బాధితులకు ప్రాథమిక దశలోనే 41 నోటీసులు ఇచ్చి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు నరేంద్రబాబు మాట్లాడుతూ.. మదనపల్లె పట్టణంలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఏఓ శేషయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సీఐ మురళీకృష్ణ, మాలమహానాడు జాతీయప్రధాన కార్యదర్శి యమలాసుదర్శనం, వెలుగుచంద్ర, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలియజేయండి

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట పంచాయతీ బోయమాల పల్లె సమీపంలో గ్రానైట్ క్వారీ నడిపేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని ఏవైన సమస్యలుంటే తెలియజేయాలని డీఆర్‌ఓ సత్యనారాయణ రావు ప్రజలను కోరారు. శనివారం క్వారీ సమీపంలో చుట్టుపక్కల ప్రజలతో బురకాయలకోటలో ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ... సర్వే నంబరు 1561,1562 లో క్వారీ కోసం అనుమతులు మంజూరయ్యాయి అన్నారు. ఈ క్వారీలో సుమారుగా 100 మందికి చుట్టుపక్కల వారినే ఉద్యోగాల్లో నియమిస్తామని చెప్పారు. రోడ్డు మార్గం ఉంటుందని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.ప్రభుత్వ నియమ, నిభందనలతో పనులు జరుగుతాయని తెలిపారు. ప్రజలు సైతం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, వాయుకాలుష్య నియంత్రన అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు.

2120 ఇళ్ల పట్టాల పంపిణీకి సిద్ధం

పీలేరు రూరల్ : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఏపీఐఐసీ లేఅవుట్-3లో మూడో విడత 2120 ఇళ్ల పట్టాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7.30 ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 320 మందికి అక్కడ పట్టాల పంపిణీ జరుగుతుందని, మిగిలిన 1800 మంది లబ్ధిదారులకు లక్కీడిప్ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా 9 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా టీకాల కార్యక్రమం

పీలేరు : పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంవో) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శనివారం స్థానిక చెన్నారెడ్డి వీధి, రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలోని కంచంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో వచ్చు ప్రతి లబ్దిదారులకు ఆరు కీ మెసేజెస్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఇందులో ఏ వ్యాక్సిన్ ఎందుకు, ఏ వ్యాధి నివారణకు ఇస్తున్నాం, వ్యాక్సిన్ వల్ల కలుగు దుష్పరిణామాలు, తిరిగి వ్యాక్సిన్ వేసుకోవడానికి ఎప్పుడు, ఎక్కడికి రావాలి, ఎంసీపీ కార్డు, చేతుల శుభ్రత, తల్లిపాలు ప్రాముఖ్యత గురించి తెలియజేయాలన్నారు. అనంతరం నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణం పోస్టర్స్ ఆవిష్కరించారు. కార్యకరమంలో హెచ్‌ఈలు మహమ్మద్ రఫీ, ఉషా, ఆరోగ్య పర్యవేక్షకులు కుసుమ, ఆరోగ్య కార్యకర్త అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

పీలేరు రూరల్ : స్థానిక ఇందిరమ్మ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు మనోదయరెడ్డి తన తల్లిదండ్రులు నారాయణరెడ్డి, సి.హెచ్. హెలన్‌కుమారి వారి జ్ఞాపకార్థం బియ్యం పంపిణీ చేశారు. శనివారం ఇందిరమ్మ కాలనీ మసీదు వద్ద మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి చేతులమీదుగా పేదలకు బియ్యం పంపణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా మనోదయరెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్తం నాణ్యమైన బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సహదేవరెడ్డి, డాక్టర్ దావూద్, బోదేషావలి, ముతవల్లి మురాషావలి తదితరులు పాల్గొన్నారు.

హైవే రహదారిపై అండర్ పాస్ నిర్మించాలి

మదనపల్లె : మదనపల్లె-తిరుపతి జాతీయరహదారి ఫోర్‌లేన్ నిర్మాణంలో భాగంగా సీటీఎం పెద్దచెరువు కింద ఆయకట్టు రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు వీలుగా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కొత్తవారిపల్లె, పోతపోలు గ్రామస్తులు విన్నవించారు. శనివారం సీటీఎం పెద్దచెరువు కట్ట కింద జాతీయరహదారి నిర్మాణపనులు జరుగుతున్న ప్రదేశంలో రెండుగ్రామాలకు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీటీఎం పెద్దచెరువు ఆయకట్టు కింద సుమారు 1,000 ఎకరాల భూమి సాగులో ఉందన్నారు. ఫోర్‌లేన్ హైవే నిర్మాణంలో భాగంగా నీటి పారుదల కాలువలు పూడ్చివేయడంతో వరిపంట పండించలేక సుమారుగా 500మంది వరకు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు పొలాల వద్దకు వెళ్లేందుకు వీలుగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని వినతులు చేసినా స్పందన లేకపోవడంతో నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు, కొత్తవారిపల్లె సర్పంచ్ బోర్‌వెల్ మహేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ..సమస్య తీవ్రతను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా రైతుల ధర్నాకు అఖిలభారత కిసాన్ రైతు సంఘం రాష్ట్ర సమితిసభ్యులు, జిల్లా సెక్రటరి వి.రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణప్ప తదితరులు మద్దతు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదాలపై అవగాహన ర్యాలీ

మదనపల్లె : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం మదనపల్లెలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అగ్ని, విద్యుత్, పెట్రోలు, గ్యాస్, డీజిల్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయం నుంచి చిత్తూరు బస్టాండు సర్కిల్, టౌన్‌బ్యాంకు మీదుగా బెంగళూరు బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

ములకలచెరువు: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలని సర్కిల్ ఫైర్ అధికారి క్రిష్ణయ్య కోరారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

భూసార పరీక్షలతో లాభాలు

బి.కొత్తకోట: భూసార పరీక్షలతో రైతులకు లాభాలు కలుగుతాయని వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్ అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. తర్వాత పోలాల్లోకి వెళ్లి పరీక్షలపై అవగాహన కల్పించారు. శివశంకర్ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, భూమిలో ఖనిజ, లవణాల లభ్యత, లోటుపాట్లను ఏ విధంగా తెలుసుకోవచ్చునో సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతులు అనవసర ఖర్చులను తగ్గించుకోవచ్చని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతుల పోలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తామని తెలిపారు. ఏఓ మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నియామకం

కలికిరి: ప్రభుత్వం ఇటీవల ఉద్యోగ అవకాశం కల్పించిన డీఎస్సీ-1998 అభ్యర్థుల్లో ఏడుగురిని మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లో నియమించినట్లు ఎంఈఓ రంగనాధరెడ్డి తెలిపారు. బి.శ్రీనివాసులు (ఎంపీపీఎస్, కొర్నమిట్టపల్లి), కె.రామిరెడ్డి (ఎంపీపీఎస్, కె.బర్నేపల్లి), జి.చిన్న వెంకటరమణ(ఎంపీపీఎస్, కుక్కలొడ్డు), ఎం.వెంకటరమణ (ఎంపీపీఎస్, మజ్జిగవాండ్లపల్లి), ఆర్.నరసింహారెడ్డి(ఎంపీపీఎస్, సన్యాసివారిపల్లి), ఎస్.రామమూర్తి(చింతమాకులపల్లి)లకు ఎంఈఓ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

నిజాయితీతో వ్యాపారం చేయాలి

కలకడ : పోలీసు వ్యాపార సముదాయాల్లో నిజాయితీతో వ్యాపారం చేయాలని దుకాణదారులకు సీఐ నాగేంద్ర సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి మూడు సంవత్సరాలకు అద్దె గదుల అగ్రిమెంట్ రెన్యువల్ చేసుకోవాలన్న నిబంధన గుర్తు చేశారు. అలాగే కేటాయించిన వ్యక్తులు మాత్రం గదులలో ఉండాలని, నెలవారి అద్దె సకాలంలో చెల్లించాలన్నారు. చట్టవిరుద్ధమైన వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

తంబళ్లపల్లె: మండలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని డాక్టర్ శ్రీధర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దిగువముత్రవారిపల్లె నల్లగుట్ట హరిజనవాడల్లో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టారు. చిన్నపిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.